# జ్ఞానంగల కుక్క

(గల్పిక)

సార్వభౌమరావుగారి దగ్గిర ఒక కుక్క ఉండేది. అది అన్నప్పుడల్లా మొరిగేదికాదు. నేరస్థులనూ, జైలుకు పోయివచ్చినవాళ్లనూ చూస్తే మాత్రమే మొరిగేది. చివరకు, ఈ విషయం ఎన్ని డజన్లసార్లు రుజువయిందంటే, అది ఎవర్ని చూసి మొరిగితే వాళ్ళు నేరస్థు లయిఉండాలని అందరూ నమ్మే స్థితికి వచ్చారు.

"అది దైవాంశగల కుక్కేమో నండీ, సార్వభౌమరావుగారూ ?" అన్నారు కొందరు. "ఏమో చెప్పలేం!" మన సత్త్వంవాళ్లు.

సార్వభౌమరావు అంతదూరం వెళ్ళ లేదుగాని, "శాస్త్రజ్ఞానానికి అందని విషయాలు జీవితంలో చాలా ఉన్నాయి," అన్నాడు.

సార్వభౌమరావుగారంటే పదవిలేని ప్రభువు, మకుటంలేని మహారాజు. మంత్రులు కూడా ఆయనతో రాచ కార్యాలు జరిపేవారు.

ఒకరోజు ఒక మంత్రిఅంతటివాడు సార్వభౌమరావు గారింటికి వచ్చాడు. కుక్కకు ఆయన ముఖం—లేక వాసన—కొత్తకాదు. కాని ఎందుకో ఈసారి కుక్క ఆయన్ను చూడగానే మొరిగింది.

మంత్రిగారి ముఖం ముందు తెల్లగా అయి, తరవాత ఎర్రగా అయింది.

"ఏమిటిది ? ఇదేమిటి ?" అన్నా డాయన.

"దాని సంగతి నేను చూస్తాను. మీరు పట్టించుకోకండి. మీకు క్షమా పణలు చెప్పుకుంటాను," అని సార్వ భౌమరావు కుక్కను ఆ రాత్రి తన పిస్తోలుతో కాల్చి చంపాడు.

ఇటీవల బయటపడింది. ఆ మంత్రి గారు సార్వభౌమ రావింటికి వచ్చే ముందు వారంరోజులక్రితం తన నౌకరు కుర్రాణ్ణి చంపి, పోలీసులచేత అడవిలో నక్సలైట్ శవాలమధ్య పారేయించి, "ఈ నక్సలైట్లు ఇక్కడ ఉండరూ అని చెప్పలేంగద !" అని అందరితోనూ అన్నాడు.

ఏమైన అలా దుర్మార్గాన్ని పసిగట్ట గల కుక్కలు - మనుషులు కూడా - పోతేనే మంచిదని ఉన్నత వర్గాలవారి అభిప్రాయం.

---

***కొడవటిగంటి కుటుంబరావు***